సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 13 । జూన్ । 2025



అర్హులందరికీ 'సంక్షేమం'

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఎమ్మెల్యే జి.మనోహర్‌రెడ్డి అన్నారు. 10లో▸



వేధిస్తున్న సిబ్బంది కొరత

దౌల్తాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది కొరత ఇటు ప్రజలతో పాటు అటు అధికారులనూ వేధిస్తోంది. 10లో▸



ఉత్సాహంగా పోటీలు

ఏరువాక సందర్భంగా యంత్రాలతో రైతుల మధ్య పోటీ నిర్వహించడం అభినందనీయమని ఎస్‌ఐ గిరి అన్నారు. 11లో▸

● 'అంగన్‌వాడీ' అదుర్స్



దుద్యాల్ మండలం గౌరారం గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో అంగన్‌వాడీ మోడల్ భవనాన్ని అన్ని వసతులతో పిల్లలను ఆకట్టుకునేలా అందంగా నిర్మించారు. జిల్లాలోనే వేగంగా పూర్తయిన భవనం ఇదే.. చిన్న పిల్లలకు అనువుగా మరుగుదొడ్లను నిర్మించారు. వంట గది, స్టోర్ రూమ్, తరగతి గది, ఆట స్థలం అందుబాటులో ఉన్నాయి. త్వరలో కలెక్టర్ చేతుల మీదుగా భవనాన్ని ప్రారంభించే అవకాశం ఉంది. ఈ భవనం ఎప్పుడు అందుబాటులోకి వస్తుందా అని చిన్నారులు, అంగన్‌వాడీ టీచర్లు ఆసక్తి ఎదురు చూస్తున్నారు.

- దుద్యాల్

● హ్యాట్సాఫ్ 'సార్'



ప్రభుత్వ బడులంటే చాలా మందికి చులకన.. అందులో పనిచేసే సిబ్బంది కూడా వారి పిల్లలను స్కూల్‌లో చేర్పించరనే అపవాదు ఉంది.. దీన్నీ ఓ ఉపాధ్యాయుడు పటాపంచలు చేశారు.. తన కుమారుడిని సర్కారు బడిలో చేర్చి తోటి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారు. కుల్కచర్ల మండలం పుట్టపహాడ్ ప్రాథమిక పాఠశాలలో వెంకటయ్య ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. గురువారం తన కుమారుడు ఆకాశ్‌ను గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించారు. హెచ్‌ఎం అజ్మతుల్లా, ఉపాధ్యాయులు ఆంజనేయులు, రమేష్, అజ్మత్ వెంకటయ్యను అభినందించారు.

- కుల్కచర్ల

● రాదారా.. గోదారా!



పై చిత్రంలో కనిపిస్తున్నది చెరువో, కుంటో అనుకుంటే పొరపాటే.. ఇది మండల కేంద్రమైన బషీరాబాద్‌లోని ఓ ప్రధాన రహదారి. గ్రామంలోని రైల్వే గేటు నుంచి పంచాయతీ కార్యాలయం వరకు సుమారు 400 మీటర్ల మేర రోడ్డు ఉంది. ఈ మార్గంలో పెద్ద గుంత ఏర్పడింది. గురువారం కురిసిన భారీ వర్షానికి గుంత నిండి నీటి మడుగును తలపించింది. దీంతో వాహనాల రాకపోకలకు, నడిచేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- బషీరాబాద్

న్యూస్‌రీల్

దుద్యాల్‌లో భారీ వర్షం



పొలంలో నిలిచిన వర్షపు నీరు, కోతకు గురైన రోడ్డు

దుద్యాల్: మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. దుద్యాల్ గేట్ సమీపం రోడ్డు కోతకు గురైంది. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఏరువాక పౌర్ణమి ముగిసిన మరుసటి రోజే భారీ వర్షం పడటంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు.

రైతులకు పరిహారం చెక్కులు అందజేత



చెక్కు అందజేస్తున్న ఉమాశంకర్‌ప్రసాద్

తాండూరు: లగచర్ల గ్రామంలో పారిశ్రామిక వాడ కోసం ప్రభుత్వం సేకరించిన భూములోని బోరు బావులకు, ఇండ్లకు గురువారం పరిహారం చెల్లించారు. తాండూరు కార్యాలయంలో గ్రామానికి చెందిన 44 మంది రైతులకు రూ.1,15,55,154 పరిహారం చెక్కులను సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అందజేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న జనం

అనంతగిరి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నుంచి ఈ నెల 21వ తేదీ వేంకటేశ్వరస్వామి ఆలయ హాల్‌లో యోగా తరగతులు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 5.30నుంచి 7గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7గంటల వరకు యోగా తరగతులు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు నారాయణ రాథోడ్, బాలకృష్ణ, వీరేశం పాల్గొన్నారు.

'బాలల హక్కులను పరిరక్షిద్దాం'

అనంతగిరి: బాలల హక్కులను పరిరక్షిద్దామని సీడబ్ల్యూసీ జిల్లా చైర్‌పర్సన్ వెంకటేష్ అన్నారు. గురువారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బాలరక్ష భవన్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలల హక్కులను పరిరక్షించడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు ప్రకాష్, సంగమేష్, పోలీసు, కార్మికశాఖ , బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్‌లైన్ బృందం, డీసీపీఓ శ్రీకాంత్, కోఆర్డినేటర్ కాంతారావు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట: ఎన్మెపల్లిలో పాఠశాల ప్రారంభోత్సవ ర్యాలీలో కోలాటం ఆడుతున్న చిన్నారులు



తాండూరు రూరల్: గౌతాపూర్‌లో తరగతి గదిని అందంగా అలంకరించిన సిబ్బంది

పండుగలా ప్రారంభం

అట్టహాసంగా తెరచుకున్న పాఠశాలలు

- విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు
- తరగతి గదులను అందంగా ముస్తాబు చేసిన సిబ్బంది
- పాఠ్యపుస్తకాలు, యూనిఫారాల అందజేత
- మొదటి రోజు సరదాగా గడిపిన చిన్నారులు



విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

వికారాబాద్: వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. మొదటి రోజు కావడంతో 50శాతం లోపే విద్యార్థులు వచ్చారు. చాలా చోట్ల స్కూల్ సమయం కంటే ముందుగానే చేరుకున్నారు. బడి గంట మోగగానే కొందు పరిగెత్తుకు రావడం కనిపించింది. పలు పాఠశాలల్లో తరగతి గదులను మామిడి తోరణాలు, పూలతో అందంగా అలంకరించారు. విద్యార్థులకు పూలు ఇచ్చి స్వాగతం పలికారు. మొదటి రోజు కావడంతో చిన్నారులు సరదాగా ఆడుకోవడం కనిపించింది. జిల్లాలో మొత్తం 1,063 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటిలో దాదాపు 80వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 74,967 యూనిఫారాలు, 5,27,290 పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు 5,21,904 పాఠశాలలకు చేరాయి. వాటిని విద్యార్థులకు అందజేశారు.

సర్కారు బడుల్లో చేర్పించండి

అనంతగిరి: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్ తల్లిదండ్రులకు సూచించారు. గురువారం పాఠశాలల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని వికారాబాద్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారని.. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేస్తారని తెలిపారు. పాఠశాలల్లో అన్ని రకాల సదుపాయాలు, వసతులు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బాబుసింగ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ విజయలక్ష్మి, హెచ్‌ఎం శ్రీశైలం, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వీరేశం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తములుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న డీఈఓ రేణుకాదేవి

బంట్వారం: విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని డీఈఓ రేణుకాదేవి అన్నారు. గురువారం మండలంలోని బొప్పునారం యూపీఎస్‌లో విద్యా సంవత్సరం ప్రారంభ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని సూచించారు. నాణ్యమైన బోధనతో పాటు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు అందిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు స్థానికుల సహకారంతో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. పాఠశాలలో తరచూ తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. చదువుతోపాటు క్రమశిక్షణ కూడా చాలా ముఖ్యమన్నారు. ప్రతిరోజూ దినపత్రికలు, పుస్తకాలు చదవటం అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. శారీరక దృఢత్వం కోసం క్రీడలు ఆడాలన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్ రావు, ఉపాధ్యాయులు విక్రమ్‌రెడ్డి, అంజమ్మ, రజిని, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- పారిశుద్ధ్య పనులు చేపట్టండి అదనపు కలెక్టర్ సుధీర్



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ ఎం.సుధీర్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో దోమల నుంచి సంక్రమించే వ్యాధుల నియంత్రణపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో దోమ కాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యలాంటి వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. వసతి గృహాలు, పాఠశాలల్లో ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని, జ్వరం, దగ్గు, జలుబుకు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలన్నారు. గ్రామాల్లో మురుగు నీరు నిలవకుండా, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకునే ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైద్యం, ఇతర సహాయం కోసం సెల్‌నంబర్ 9702705161లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో డీటీడీఓ కమలాకర్ రెడ్డి, డీబీసీడీఓ ఉపేందర్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్ నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్ర యాదవ్, వివిధ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బలమైన శక్తిగా భారత్

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి



కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తిలకిస్తున్న ప్రేమేందర్‌రెడ్డి తదితరులు

అనంతగిరి: ప్రపంచంలోనే మనదేశం నేడు నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా దూసుకుపోతోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. గురువారం వికారాబాద్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ పదకొండేళ్ల పాలనపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు వికసిత్ భారత్ అమృత్ కాల్ అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రధాన రోడ్డు వద్ద ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నేడు దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతోందన్నారు. ఈ నెల 17నుంచి గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించి మోదీ పాలనను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ ట్రెజరర్ విజయ్‌సూరన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి, జిల్లా కన్వీనర్ శేరి శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానందరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షురాలు యాస్కి శిరీష, రాష్ట్ర నాయకురాలు సుచరితారెడ్డి, మండల అధ్యక్షుడు శివరాజ్‌గౌడ్,, జిల్లా నాయకులు బస్వలింగం,శ్రీకాంత్‌రెడ్డి, నరోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శుభప్రద్‌పటేల్

రైతులకు న్యాయం చేయాలి

- రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్

అనంతగిరి: వరి కొనుగోలు కేంద్రాల్లో అధికారులు ఇష్టారాజ్యాంగ వ్యవహరిస్తున్నారని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. గురువారం యాలాల మండలం జంటుపల్లి రైతులతో వచ్చి కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిశారు. రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. స్పందించిన కలెక్టర్ రైతులకు న్యాయం జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం శుభప్రద్‌పటేల్ మాట్లాడుతూ.. తరుగు పేరుతో రైతులను మోసం చేస్తూ 41 కిలోలకు కాంట పెట్టడానికి బదులు 43 కిలోలు తీసుకుంటున్నారని తెలిపారు. రైస్ మిల్లర్లు సైతం 50 బస్తాలు ఉన్న రైతు దగ్గర రెండు బస్తాలు, 70 బస్తాలు ఉంటే 3 బస్తాలు, 100 బస్తాలకు 5 బస్తాలు, 150 బస్తాలకు 8 బస్తాలు కట్ చేస్తూ రైతులను దోచుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో బాధిత రైతులు రాంచందర్ శాంతప్ప, గోవర్ధన్ గౌడ్, సోను, గోవింద్, నాయకులు రవిశంకర్, సిద్దిఖ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో కొడంగల్

- సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో వేగంగా సాగుతున్న పనులు
- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్: అభివృద్ధి పథంలో కొడంగల్ దూసుకుపోతోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి అన్నారు. పట్టణంలోని కడా కార్యాలయంలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని ఎనిమిది మండలాల్లో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో రూ.10 వేల కోట్లతో వివిధ పనులు ప్రారంభించామని చెప్పారు. కొడంగల్‌కు ప్రభుత్వ మెడికల్ కళాశాల, నర్సింగ్, ఫిజియోథెరపీ, పారా మెడికల్ కాలేజీలు మంజూరయ్యాయని వెల్లడించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని 220 బెడ్లకు విస్తరించడంతో పాటు టీచింగ్ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేశారన్నారు. అర్హులందరికీ రైతు భరోసా, రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందిస్తున్నామని చెప్పారు. అనంతరం పట్టణంలోని ప్రకృతి వనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కడా అధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అంబయ్యగౌడ్, మహ్మద్ యూసూఫ్, నందారం ప్రశాంత్, నయీమ్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, తహశీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ ఉషశ్రీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రసాయన ఎరువులు తగ్గించాలి


మాట్లాడుతున్న డాక్టర్ సుజాత

నవాబుపేట: రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని డాక్టర్ కె.సుజాత సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పంట సాగులో యూరియా వాడకాన్ని ఎలా తగ్గించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట పంటలు వేసి భూసారాన్ని పెంచాలన్నారు. భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యంతో సాగు ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. నీటి వృథాను అరికట్టే పద్ధతులను వివరించారు. అనంతరం శాస్త్రవేత్త సి.యమున పంటమార్పిడి, మిశ్రమ పంటల సాగు ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ జ్యోతి, మార్కెట్ కమిటీ చైర్మన్ గీతాసింగ్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, ఏఈఓలు ఆదిల్, రమాదేవి, పవన్, లక్ష్మీ, మల్లేశ్ తదితరులు పాలొగొన్నారు.

సహకార సంఘాలను వినియోగించుకోవాలి

జిల్లా కోఆపరేటివ్ అధికారి నాగార్జున



మాట్లాడుతున్న డీసీఓ నాగార్జున

ధారూరు: సహకార సంఘాలకు కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంకులు మంజూరు చేస్తుందని జిల్లా కోఆపరేటివ్ అధికారి నాగార్జున పేర్కొన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా గురువారం ధారూరు పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన డైరెక్టర్లు, రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఓ మాట్లాడుతూ.. సహకార సంఘాలు తక్కువ ధరకు లభించే జనరిక్ మందుల దుకాణాలను నడుపుకోవాలన్నారు. నాబార్డు సహకార సంఘాన్ని ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్‌గా ఎంపిక చేసిందన్నారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం అఖిల్‌పూనా, అధికారులు విక్రమ్, మహ్మద్‌అలీ, ఫరీన్‌ఫాతిమా, నర్సింహులు, డైరెక్టర్లు సుధాకర్‌గౌడ్, శివకుమార్, గోపాల్ రెడ్డి, మల్లయ్య, అబ్దుల్‌కరీం, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌లతో భూగర్భ జలాల పెంపు

- పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ రవీందర్
- యావాపూర్, వట్టిమీనపల్లిలో పర్యటన


నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

నవాబుపేట: రాతి కట్టలు, ఫారంపాండ్ పనులతో భూగర్భ జలాలు పెరుగుతాయని పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ అన్నారు. మండల పరిధిలోని యావాపూర్, వట్టిమీనపల్లిలోని చెక్‌డ్యామ్‌లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెక్‌డ్యామ్‌లతో పాటు చిన్న చెరువుల నిర్మాణానికి చొరవ తీసుకోవాలని సూచించారు. వర్షాలు సమృద్ధిగా కురిసిన వెంటనే నర్సరీల్లోని మొక్కలను నాటించాలని ఆదేశించారు. ఆయన వెంట డీపీఓ జయసుధ, డీఎల్‌పీఓ సంధ్యారాణి, ఎంపీడీవో అనురాధ, ఎంపీఓ విజయ్‌కుమార్, ఏపీఓ లక్ష్మీదేవి, టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్, జగదీశ్, రవి, విష్ణువర్ధన్ రెడ్డి, ఈసీ జ్యోతి, పంచాయతీ కార్యదర్శులు గీత, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగ దొరికాడు

- ఉత్తర్‌ప్రదేశ్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నిందితుడిపై 30కిపైగా కేసులు


ఎస్‌ఐ అరుణ్‌తోపాటు సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి


నిందితుడు నందులాల్ రాజ్‌బార్

నవాబుపేట: వ్యవసాయ క్షేత్రాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, వాటిలోని రాగి తీగ, ఆయిల్‌ను దొంగిలిస్తున్న అంతర్రాష్ట్ర దొంగ నందులాల్ రాజ్‌బార్(35)ను నవాబుపేట పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. 30 పైగా ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసిన కేసుల్లో ఇతనిపై నాన్‌బెయిలబుల్ వారెంట్లు ఉన్నాయి. వారం రోజుల పాటు శ్రమించిన పోలీసులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అజంగఢ్ జిల్లాలోని తన స్వగ్రామమైన చెన్నైలో నిందితుడిని అరెస్టు చేశారు. ఇతను గ్యాస్ వెల్డింగ్ పనులు చేసేవాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో నేరాల బాట పట్టాడు. తన వృత్తిని అడ్డు పెట్టుకుని నిర్మానుష్య ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని అందులోని కాపర్, ఆయిల్‌ను దొంగిలించి సొమ్ము చేసుకునేవాడు. 2020–21లో నవాబ్‌పేట్ పీఎస్ పరిధిలో చేసిన పదికి పైగా కేసుల్లో అరెస్టయి జైలుకు వెళ్లాడు. అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చి, వికారాబాద్ జేఎఫ్‌సీఎం కోర్టులో జరుగుతున్న విచారణకు హాజరు కాకుండా పరారీలో ఉన్నాడు. దీంతో న్యాయస్థానం అతనిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. నిందితున్ని పట్టుకుని వెంటనే తమ ముందు హాజరు పర్చాలని పోలీసులను ఆదేశించింది. దీంతో ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు నవాబ్‌పేట్ ఎస్‌ఐ అరుణ్ కుమార్, సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ప్రధాన నిందితుడు ఉత్తరప్రదేశ్‌లో ఉన్నట్లు పక్కా సమాచారం అందుకుని వారం రోజులుగా అజంగఢ్ జిల్లాలో మకాం వేశారు. స్థానిక పరిస్థితులను అధిగమించి, నిందితుడి కదలికలపై నిఘా పెట్టి, అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన ఎస్‌ఐ అరుణ్ కుమార్‌తో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. నిందితుడిపై నవాబుపేట పీఎస్‌లో 10, క్పల్లి పీఎస్‌లో 16, మోమిన్‌పేట్ పీఎస్‌లో 3, ధారూరు, బంట్వారం పీఎస్‌ల పరిధిలో ఒక్కోటి చొప్పున కేసులు నమోదైనట్లు తెలిపారు. వీటితో పాటు సంగారెడ్డి, సైబరాబాద్, నల్గొండ, నిజామాబాద్, సూర్యాపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కూడా ఈ తరహా కేసులు నమోదయ్యాయని స్పష్టంచేశారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపర్చి, మిగిలిన వారిని సైతం పట్టుకుంటామన్నారు.

బైక్‌ల దొంగకు కటకటాలు

- 15 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- నిందితుడిపై 20కిపైగా కేసులు


పట్టుబడిన బైకులు, దొంగతో పోలీసులు

తాండూరు టౌన్: బైకులు చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగను తాండూరు పట్టణ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఏకంగా 15 బైకులను దొంగిలించిన నిందితుడు, ఇందులో 10 బైకులు విక్రయించి.. మరో బైక్‌పై దర్జాగా తిరుగుతుండగా ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాలాల మండలం కమాల్‌పూర్ గ్రామానికి చెందిన బోయిని శ్రీకాంత్ ఆటో డ్రైవర్‌గా పని చేసేవాడు. బుధవారం స్థానిక విలియంమూన్ చౌరస్తా వద్ద ఎస్‌ఐ సాజిద్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో బైక్‌పై వచ్చిన శ్రీకాంత్ పోలీసులను చూసి బైకు వదిలేసి పారిపోతుండగా, వెంబడించి పట్టుకున్నారు. అనంతరం తమ దైన శైలిలో విచారించగా అసలు విషయం బయటపెట్టాడు. జిల్లాలో చోరీ చేసిన 15 బైకుల్లో 10 బైకులను తాండూరు మండలం బిజ్వార్ గ్రామంలో పలువురికి విక్రయించినట్లు అంగీకరించాడు. మిగిలిన ఐదింటిలో నాలుగు బైకులను తన ఇంట్లో దాచి పెట్టి మరో బైకుపై దర్జాగా తిరుగుతున్నాడు. దీంతో రూ.7.50 లక్షల విలువైన 15 బైకులను స్వాధీనం చేసుకుని, గురువారం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. అయితే గతంలో ఇతనిపై సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 20 కేసుల వరకు నమోదయ్యాయి. వీటిలో పలు కేసుల్లో జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. అయినా తీరు మార్చుకోలేదు. బైకు చోరీ కేసులను ఛేదించిన పట్టణ సీఐ సంతోష్ కుమార్, ఎస్‌ఐ సాజిద్, క్రైమ్ సిబ్బంది అమ్జద్, శివ, సాయప్ప, షబీల్‌ను ఎస్పీ నారాయణరెడ్డి అభినందించారు.

సదస్సులను వినియోగించుకోండి


పరిగి: సుల్తాన్‌పూర్‌లో సదస్సు

పరిగి: రెవెన్యూ సదస్సులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఆనంద్‌రావు సూచించారు. గురువారం మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూభారతి రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. వెంటనే రైతులు సదస్సులో అర్జీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారానికే..

తాండూరు రూరల్: భూ సమస్యలు పరిష్కారానికే భూ భారతి చట్టం ఉందని తహసీల్దార్ తారాసింగ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బెల్కటూర్, కొటబాసుపల్లి, చిట్టిఘనాపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 20వ తేదీ వరకు సదస్సులు నిర్వహిస్తామన్నారు.

సదస్సులకు విశేష స్పందన

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 35 ఫిర్యాదులు అందినట్లు ఉప తహసీల్దార్ వీరేశ్ తెలిపారు. రెవెన్యూ సదస్సులకు విశేష స్పందన వస్తుందని ఆయన తెలిపారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లాపూర్‌లో..

కుల్కచర్ల: భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని అల్లాపూర్ గ్రామపంచాయతీలో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు.

బాలలను పనిలో పెట్టుకోవద్దు

- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- ఆర్‌టీఏ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్


సిద్దలూరు పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో జాఫర్, ఉపాధ్యాయులు తదితరులు

అనంతగిరి: బాలలను పనిలో పెట్టుకోవద్దని ఆర్‌టీఏ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్ అన్నారు. వికారాబాద్ మండలం సిద్దులూర్‌లో గురువారం అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ తీశారు. అనంతరం అయన మాట్లాడుతూ.. బాలలను విధిగా స్కూళ్లకు పంపాలన్నారు. బాలల రక్షణకు ప్రభుత్వం అనేక చట్టాలను తీసుకువచ్చిందని తెలిపారు. వారు ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. బాలలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఉచితంగా యూనిఫాంలు, పుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు దీటుగా బోధన అందుతోందన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంఈఓ బాబుసింగ్, సాధన కోఆర్డినేటర్ నర్సింలు, హైస్కూల్ హెచ్‌ఎం రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రసన్నకుమార్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో రెడ్‌బుక్ రాజ్యాంగం

సీపీఐ పరిగి డివిజన్ కార్యదర్శి పీర్ మహమ్మద్



పరిగి: ఏపీలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, ప్రశ్నించే జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని సీపీఐ పరిగి డివిజన్ కార్యదర్శి పీర్ మహమ్మద్ మండిపడ్డారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. సాక్షి టీవీ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాస్‌పై ఏపీ సర్కార్ కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నందుకే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతోందన్నారు. కూటమి ఏడాది పాలనలోనే అరాచకాలు పతాక స్థాయికి చేరాయని ఆవేదన వ్యక్తంచేశారు. రానున్న రోజుల్లో ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

అనంతగిరి: రైలుకింద పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన వికారాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ హరిప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం తెల్లవారుజామున వికారాబాద్-సదాశివపేట రైల్వే లైన్‌లో పులుమద్ది గ్రామం సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉన్నాడని రైల్వే స్టేషన్ అధికారులు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించగా మృతుడి వయస్సు 40–45 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై బ్లూకలర్ టీషర్ట్, బూడిదరంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని గుర్తించారు.

చోరీకి పాల్పడిన వ్యక్తికి ఆరు నెలల జైలు

బొంరాస్‌పేట: చోరీకి పాల్పడిన నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని మెట్లకుంటకు చెందిన ఈడిగి ఆలమ్మ హోటల్‌లో జనవరి 16న రాత్రి ఇదే గ్రామానికి చెందిన సమ్మగళ్ల శేఖర్ దొంగతనానికి పాల్పడ్డాడు. ఆలమ్మ హోటల్ తాళాలు, బీరువా తాళాలు విరగ్గొట్టి అందులో ఉన్న 26 తులాల వెండి పట్టీలు, రూ.6 వేల నగదు దొంగిలించాడు. ఈ సంఘటనలో నేరస్తుడు శేఖర్‌పై కేసు నమోదు చేసి విచారణలో ఉండగా గురువారం కొడంగల్ న్యాయమూర్తి శ్రీరామ్ నేరస్తుడికి 6నెలల జైలు శిక్ష విధించారని ఎస్‌ఐ మహ్మద్ రవూఫ్ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల కమిటీ ఎన్నిక


మొగులయ్య


విజయ్

దోమ: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గ కమిటీని ఆ సంఘం నేతలు ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా ఎస్.మొగులయ్య(దాదాపూర్), ప్రధానకార్యదర్శిగా విజయ్(ఊటుపల్లి), ఉపాధ్యక్షులుగా రవి(రాకొండ), సంతోషి(గంజిపల్లి), గౌరవ అధ్యక్షులుగా రవీందర్‌రెడ్డి(మోత్కుర్),చంద్రశేఖర్(దోమ), రాజేశ్(దిర్సంపల్లి), కోశాధికారిగా సందీప్(పలుగు తండా), ఆర్గనైజేషన్ సెక్రటరీగా తిరుపతయ్య(చిన్న,పెద్దతండా), సోషల్‌మీడియా కన్వీనర్‌గా నరేందర్‌గౌడ్(ఐనాపూర్) తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

ఉపాధి హామీ పథకం పీడీ శ్రీనివాస్


విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న అధికారులు

పూడూరు: ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని పీడీ శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం పూడూరు రైతు వేదికలో ఉపాధి పనులకు సంబంధించి బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పనికి లెక్క చూపించాలన్నారు. అలాగే కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించాలని సూచించారు. అనంతరం పూడూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పాండు, ఎంఈఓ సాయిరెడ్డి, ఏఈఎం బందయ్య, ఉపాధ్యాయులు అంజిలయ్య, మాణిక్యచారి, పుష్పలత, లక్ష్మి, నిఖిల, అస్మాబేగం, వీఓఏ అక్షిత, పరిదా, అంగన్‌వాడీ టీచర్లు పుష్పమ్మ, వనజ పాల్గొన్నారు.

నిధులు లేక నిర్వహణ భారం

- ఎంపీడీఓకు వినతిపత్రం అందజేసిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు

ధారూరు: సర్పంచుల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నుంచి నిధులు రావటం లేదని గురువారం కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నర్సింహులుకు జీపీల్లోని ట్రాక్టర్ల తాళాలు ఇచ్చి, డీజిల్‌కు డబ్బులు లేక వాటిని నడిపించలేకపోతున్నామని వినతిపత్రం ఇచ్చారు. ప్రత్యేక అధికారుల గ్రామ పంచాయతీల్లో వివిధ పనుల కోసం తమకు వచ్చిన వేతన డబ్బులను ఖర్చు చేస్తున్నామన్నారు. ఇక నుంచి పంచాయతీల నిర్వహణ భారం తమవల్ల కాదన్నారు. ఆర్థిక పరమైన విధులను బహిష్కరిస్తున్నమని ఎంపీడీఓకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తుల ఆహ్వానం

కొడంగల్ రూరల్: ఇప్పటివరకు ఒక్కసారి కూడా రైతు భరోసాకు అర్జీ చేసుకోనివారు, వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ రాజు రాథోడ్ ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు భూమి పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు సేవింగ్ ఖాతా పాస్ బుక్ జిరాక్స్‌లతో ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇంతకు ముందు రైతు భరోసా వచ్చి ఉన్న రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోరాదని ఆయన సూచించారు.

బొంరాస్‌పేట ఏఓ..

బొంరాస్‌పేట: మండల పరిధిలోని రైతులందరూ ప్రభుత్వం అందించే రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పోలప్ప తెలిపారు. ఈనెల 5 నాటికి భూభారతిలో రిజిస్ట్రేషన్ చేసి, పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులంతా ఏడాది రైతు భరోసా పథకం లబ్ధి కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దౌల్తాబాద్ ఏఓ..

దౌల్తాబాద్: మండలంలోని ఆయా గ్రామాల రైతులు ఈ నెల 5 వరకు పట్టా పొందిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాల రైతులు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఓ లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు.

కోట్‌పల్లి ఏఓ..

బంట్వారం: ఇటీవల పట్టా పాస్‌బుక్ పొందిన రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ కోట్‌పల్లి ఏఓ కరుణాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని..

మనస్తాపంతో రైలు కిందపడి భర్త ఆత్మహత్య


రాజు (ఫైల్)

నవాబుపేట: భార్య పుట్టింటికి వెళ్లిందనే మనస్తాపంతో ఓ వ్యక్తి గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడ్చర్ల గ్రామానికి చెందిన పల్లె రాజు(39) వ్యవసాయం చేసుకొని జీవించేవాడు. పది రోజుల క్రితం కుటుంబ తగాదాలతో భార్య లావణ్య ఇద్దరు పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటినుంచి ఒంటరిగా ఉంటున్న ఆయన గురువారం గ్రామ శివారులోని రైలు పట్టాలపై పడి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ హరి ప్రసాద్ తెలిపారు.

ఫెర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు

ధారూరు: మండల కేంద్రంలోని తుల్జాభవానీ ఫెర్టిలైజర్ షాప్‌లో గురువారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ గంగాప్రసాద్ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో అనుమతి లేని పత్తి విత్తనాలు, క్రిమి సంహారక మందులను గుర్తించారు. 16 ప్యాకెట్ల పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఇతర దుకాణాల యజమానులు షాపులను బంద్ చేసి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చిరించారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు విధిగా రశీదులు పొందాలని సూచించారు.

సహాయక చర్యల్లో కుల్కచర్ల వాసి


ఘటనాస్థలిలో సహాయక చర్యలో శ్రీనివాస్

కుల్కచర్ల: గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో గురువారం విమానం కుప్పకూలిన ఘటనలో సహాయక చర్యల నిమిత్తం మండల వాసి పాల్గొన్నారు. బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన అన్నసారం శ్రీనివాస్ ఆర్మీలో సేవలను అందిస్తున్నారు. విమాన ప్రమాదం సంభవించడంతో ఆర్మీలో రంగంలోకి దిగింది. ఆ బృందంలో ఉన్న శ్రీనివాస్ సహాయక చర్యల్లో పాలు పంచుకున్నారు. దీంతో మండలవాసులు ఆయన సేవలను కొనియాడుతున్నారు.

కష్టపడే వారికి సముచిత స్థానం

పీసీసీ అబ్జర్వర్ వినోద్‌రెడ్డి


మాట్లాడుతున్న పార్టీ అబ్జర్వర్ వినోద్‌రెడ్డి

అనంతగిరి: పార్టీ కోసం అహర్నిశలు పాటుపడే వారికి సముచిత స్థానం కల్పిస్తామని పీసీసీ అబ్జర్వర్ వినోద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు గురువారం వికారాబాద్ పట్టణంలో నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చామన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఈ ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ కోసం ఎంతో కష్టపడి అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. పార్టీకి కార్యకర్తలే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పీసీసీ సహాయక అబ్జర్వర్ నరేందర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణ, జాఫర్, కిషన్‌నాయక్, నర్సింలు, అనంత్‌రెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ‘సంక్షేమం’


వర్షంలో తడచుస్తూ తలపై కుర్చీలు పెట్టుకొని ఎమ్మెల్యే ప్రసంగాన్ని వింటున్న ప్రజలు


పెద్దేముల్‌లో ఇందిరమ్మ నమూనా ఇంటితో బండిపై ఊరేగింపుగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

- తాండూరు, పెద్దేముల్‌లో పర్యటన
- చిలుకవాగు పరిశీలన, ఇందిరమ్మ పట్టాల పంపిణీ

తాండూరు/తాండూరు రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి అన్నారు. రూ.2.21 కోట్లతో తాండూరులో నిర్మించనున్న మురుగు కాల్వలకు వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డితో కలిసి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నామని, ఇందులో భాగంగానే చిలుక వాగు ప్రక్షాళన, మురుగు కాల్వల నిర్మాణ పనులను చేపట్టామని స్పష్టంచేశారు. భారీ వర్షాలు కురిస్తే మున్సిపాలిటీలోని పలు ప్రాంతాలు జలమయం అవుతున్నాయన్నాని తెలిపారు. గత పాలకులు నిర్లక్ష్యంతోనే చిలుకవాగు నిరాదరణకు గురైందని ఆవేదన వ్యక్తంచేశారు. సంక్షేమ పథకాల అమలుపై ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది, మాజీ కౌన్సిలర్లతో సమీక్ష నిర్వహించారు. అర్హులందరికీ సబ్సిడీ సిలిండర్, ఉచిత విద్యుత్ అందేలా చూడాలన్నారు. కాగ్నా నది పంప్ హౌస్ మోటార్లను కాలం చెల్లాయని కొత్త మోటార్లను బిగించాలని తెలిపారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందజేశామని, నిర్మాణాలు ప్రారంభించుకోవాలని చెప్పారు. కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధికి ప్రభుత్వం రూ.90 కోట్ల నిధులు చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, మాజీ కౌన్సిలర్లు నీరజాబాల్‌రెడ్డి, సోమశేకర్, మమత, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చాలా ఆనందంగా ఉంది..

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తన చేతులమీదుగా పట్టాలు అందజేయడం చాలా ఆనందంగా ఉందని, తాను ఎమ్మెల్యేగా గెలిచిన రోజు కూడా ఇంత సంతోషాన్ని అనుభవించలేదని మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు, పెద్దేముల్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. అంతకుముందుకు ఇందిరమ్మ నమూనా ఇంటితో ఏర్పాటు చేసిన ఎడ్ల బండిపై ఎమ్మెల్యేను ఊరేగించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బీఎమ్మార్ మాట్లాడుతుండగా వర్షం మొదలైంది. ఆయన వర్షంలోనే తడుస్తూనే తన ప్రసంగాన్ని కొనసాగించగా, మహిళలు తాము కూర్చున్న కుర్చీలను తలపై పట్టుకుని ఆసక్తిగా విన్నారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ సభ్యుడు రమేష్ మహరాజ్, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సూజత, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, కాంగ్రెస్ బ్లాక్ ఏ అధ్యక్షుడు లొంక నర్సిములు, మండలాల అధ్యక్షుడు నాగప్ప,గోపాల్, నాయకులు పాల్గొన్నారు.